# సహజంగా కృత్రిమం (Naturally Synthetic)

*భార్గవీ రావు*

మాల్ లో అడుగుపెట్టానో లేదో
రకరకాలపూలు, గుత్తులుగుత్తులుగా
రమ్యంగా, రంగుల స్వాగతం పలికాయి.
మంచుముత్యాలలే మెరిసే మందారాలు
అరచెయ్యంత ఎర్రగులాబీలు
చివురురంగు ఆకులమధ్య ఒదిగిపోయి
చిరునవ్వుతో పిలుస్తున్నట్టనిపిస్తే,
ఆపుకోలేక ఆర్తిగా దగ్గరకెళ్ళి
వేళ్ళతో సుకారంగా నిమిరాను - కానీ
అవి 'సిల్క్‌ఫ్లవర్స్'!
కళాకారుణి హస్తవాసిలోపూసి
భావుకతలో విరిసిన పూలు - అచ్చు
నిజం పూలలాగే అనిపించాయి

నిరుత్సాహంతో నడిచాను ముందుకు
పూలకుండీల్లో 'జెర్బెరాస్' - తెల్లగా
సన్నగా, నిటారుగా నించున్న లిల్లీలు
వంగపూరంగులో విచ్చుకున్న మరో గుత్తి
అడుగులో అడుగేసుకుంటూ
కాస్త దగ్గరకెళ్ళాను మెల్లగా!
అలరించే సన్నని సువాసన!!
నమ్మకం కుదరక, మెత్తగా ముట్టుకున్నాను.

అవి 'నిజం' పూలు!
అచ్చు 'సిల్క్‌ఫ్లవర్స్'లా ఉన్నాయి.

అమెరికాలో అంతా చేద్యమే
నిజం - సింథెటిక్‌గా
కృత్రిమం - సహజంగా!

ఇంకొంచెం ముందుకు నడిచాను

సృష్టిలో విచిత్రమంతా విరజల్లినట్టు

ఆడామగా, పిల్లా పీచూ - నడుస్తూ

పిల్లల్ని భుజాలమీద మోస్తూ,

బళ్ళలో తోస్తూ ..
ఒంటికి అతుక్కుపోయిన బట్టలతో

ఒకరిమీద ఒకరు వాలిపోతూ
ముద్దుల్నీ మురిపాల్నీ కలబోసుకుంటూ

ముందుకు నడుస్తున్నారు.

మనుషులు 'మేనెక్విన్స్' లా అనిపించే

మయసభలాటి పేద్ద 'మాల్'
చిత్రాలు నిశితంగా ఫోటోల్లా

ఫోటోలు ఆయిల్ పేంటింగ్‌స్లా ..

మెరిసిపోయే దీపాల వెలుగులో

నిజమే ననిపించే భ్రమలో
వీటిని కొనకపోతే
జీవితమే కోల్పోతామనిపించే భ్రమలో

అద్భుతంగా అలరించే
అమెరికాలో అంతాచేద్యమే!

- భార్గవీ రావు